చార్మినార్‌లో నిరంతర విద్యుత్ సరఫరా

చార్మినార్: చార్మినార్‌లో నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏఈ మహమ్మద్ తెలిపారు. కోకర్‌వాడికి చెందిన టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టితో పాటు స్థానికులు చేసిన ఫిర్యాదుపై ఆయన వెంటనే స్పందించి సిబ్బందితో కలిసి గురువారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. దక్షిణ మండలం ఎస్ఈ సోమిరెడ్డి, చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్, ఏడీఈ మక్సూద్ ఆదేశాల మేరకు సిబ్బంది రౌండ్ ది క్లాక్ సేవలను అందజేస్తున్నారన్నారు.

గుజరాతీ సమాజ్ ట్రస్టీ చైర్మన్‌గా జస్మత్ పటేల్


జస్మత్‌పటేల్‌ను సన్మానిస్తున్న నాయకులు

సుల్తాన్‌బజార్: గుజరాతీ సమాజ్ ట్రస్టీ చైర్మన్‌గా జస్మత్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిదేశ్ జాగిర్దార్, మహేశ్ అగర్వాల్, యష్ రాజ్ మాట్లాడుతూ.. జస్మత్‌పటేల్ గోవులను రక్షించి గోశాలలు ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో గోరత్న, హిందూ రత్న పురస్కారాలు అందుకున్నారన్నారు.

హెచ్‌ఆర్.కోలాకు ఘన నివాళి



నాంపల్లి: రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో సీనియర్ మిమిక్రీ కళాకారుడు హెచ్‌ఆర్.కోలా సంస్మరణ సభను తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారులు అశోక్‌కుమార్, మల్లం రమేశ్, చంద్రముఖి చంద్రశేఖర్, ఆంథోని రాజ్ హాజరై కోలా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

తల్లిపాలలో పోషక విలువలు అధికం



గోల్కొండ: సేవా భారతీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెహిదీపట్నం సింధూ మహిళా కళాశాలలో గురువారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయ సందేష్ మాట్లాడుతూ.. తల్లిపాలలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంధ్య, సేవా భారతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, మనోజ్, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే డ్రంకన్ డ్రైవ్

యాకుత్‌పురా: ప్రమాదాల నివారణకే డ్రంకన్ డ్రైవ్ చేపడుతున్నామని మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ అన్నారు. దారుషిఫా సాలార్‌జంగ్ రోటరీ ప్రాంతంలో గురువారం ఉదయం సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి ఆటో నడుపుతున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సైలు, ఎస్సైలు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

19న సోషలిస్టు ప్రతినిధుల సభ

పంజగుట్ట: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టం తీసుకురావాలని సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కార్యదర్శి సింగం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన గన్‌ఫౌండ్రీలోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో సోషలిస్టు ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ కరపత్రాన్ని గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యదర్శి జైబాబు, జాతీయ కార్యదర్శి ఎన్.రాజు, కూనపురెడ్డి ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రైవేట్ రంగం 90 శాతం ఉంటే ప్రభుత్వ రంగం కేవలం 10 శాతం మాత్రమే ఉందని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంవల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎంతో నష్టపోతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. జిలకర బాలస్వామి, అశ్విని పూలే, సరిత పాల్గొన్నారు.


నానల్‌నగర్ వద్ద సహాయక చర్యల్లో హైడ్రా, ట్రాఫిక్ సిబ్బంది


మాసబ్‌ట్యాంక్ ప్రధాన రోడ్డుపై వరద

వాన..వరద

- రోడ్లు.. లోతట్టు ప్రాంతాలు జలమయం
- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్
- కూలిన చెట్లు.. నిలిచిన విద్యుత్ సరఫరా

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం 2 గంటల పాటు వర్షం దంచికొట్టింది. దీంతో రోడ్లు, చౌరస్తాలు జలమయమయ్యాయి. గుడిమల్కాపూర్ చౌరస్తా, మెహిదీపట్నం, టోలిచౌకీ చౌరస్తా, కార్వాన్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలైన నదీమ్‌కాలనీ, లంగర్‌హౌస్ లక్ష్మీనగర్ కాలనీ, గోల్కొండ రేతిగల్లీ తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

సహాయక చర్యల్లో ట్రాఫిక్, హైడ్రా సిబ్బంది

భారీ వర్షానికి రేతిభౌలి చౌరస్తా, నానల్‌నగర్, లంగర్‌హౌస్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని రహదారులన్ని చెరువులను తలపించాయి. నానల్ నగర్ చౌరస్తా వద్ద వాహనాదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులతో పాటు హైడ్రా అధికారులు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మ్యాన్‌హోల్స్ మూతలు తెరిచి వరద వెళ్లేలా చర్యలు చేపట్టారు.


హనుమాన్ నగర్ వీధుల్లో పోటెత్తిన వరద

నాంపల్లి: మల్లెపల్లి, రెడ్‌హిల్స్‌లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీనికితోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనాలు అవస్థలు పడ్డారు. లక్డీకాపూల్ నుంచి సైఫాబాద్, లక్డీకాపూల్ మెహిదీపట్నం వెళ్లే రహదారిలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అలాగే బోయిగూడ కమాన్ నుంచి ఆసిఫ్‌నగర్‌కు వెళ్లే పాత ముంబాయి హైవేపై ట్రాఫిక్ స్తంభించింది.

చార్మినార్: పాతబస్తీలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల లోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాంద్రాయణగుట్ట శివారు నుంచి పాతనగరం ద్వారా వెళ్లే నల్లవాగు నాలా నిండుగా ప్రవహించడంతో పాటు వరద పరిసర ప్రాంతాల్లోని వీధుల్ని ముంచెత్తడంతో ఆయా ప్రాంతాలు చెరువులను తలపించాయి. డబీర్‌పురా దర్వాజా నుంచి డబీర్‌పురా ఫ్లై ఓవర్ వరకు యాకుత్‌పురా రైల్వే బ్రిడ్జి, తలాబ్‌కట్టా రైల్వే బ్రిడ్జి కింద వరద నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.


ఛత్రినాక-శివాజీనగర్ రోడ్డులో..

కొత్త కోర్సులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ పాట్రిక్స్

చార్మినార్: మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకు విద్యార్థులను సన్నద్ధం చేయడంతో పాటు అధ్యాపకులకు సైతం అవగాహన ఉండాలని ఓయూ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ప్యాట్రిక్స్ సూచించారు. సిటీ కాలేజీలో ఏఈడీపీ కోర్సులపై అధ్యాపకులకు నిర్వహించిన 3 రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. చివరి రోజు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కళాశాలలు అందిస్తున్న కోర్సులకు, పరిశ్రమల్లో నిర్వహించబోయే బాధ్యతలకు మధ్య ఉండే అవకాశాలు, సవాళ్ల గురించి చర్చించి.. పరిష్కారాల కోసం ఆలోచించేందుకు ఇలాంటి వేదికలు దోహదం చేస్తాయన్నారు. ఎఫ్‌డీపీలో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్, దక్షిణ విభాగానికి చెందిన రాజమణి రాజు జాతీయ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ పథకంపై అవగాహన కల్పించారు. కళాశాల గ్రంథాలయ పాలకుడు డా.సీహెచ్.రవి కుమార్ ఓపెన్ ఎడ్యుకేషనల్ రీసోర్సెస్ తో ప్రభావ వంతంగా తరగతుల నిర్వహణ గురించి వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కు చెందిన ప్రొఫెసర్ వై. రామకృష్ణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భవిష్యత్తు వృత్తి నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డా.పీ శాంతి మాట్లాడుతూ.. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపు దిద్దుకుంటున్న కోర్సులు, బోధనా పద్ధతుల గురించి అధ్యాపకులు నిరంతరం అప్‌డేట్ కావాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో కన్వీనర్ డా.మల్లికార్జున్ నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఇఫత్ ఉన్నీసా, లలిత చైతన్య, డా.రవీంద్ర, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఈటీ పోస్టులు మంజూరు చేయాలి


సీఎస్ రామకృష్ణరావుకు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: రానున్న డీఎస్సీలో పీఈటీ పోస్టులు మంజూరు చేయాలని వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (పెటా టీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు రాఘువరెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1804 పాఠశాలల్లో పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. క్రీడాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ పాలసీని ఆమోదించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాగా చీఫ్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

మార్కెట్లకు రాఖీ శోభ..!


స్వసిక్ చౌరస్తాలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు


సిద్ధిఅంబర్‌బజార్‌లో ..

జియాగూడ: మార్కెట్లలో రాఖీ సందడి నెలకొన్నది. ఈనెల 9న రక్షా బంధన్ నేపథ్యంలో మహిళలు, యువతులు రాఖీలు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో బేగంబజార్ మార్కెట్లకు తరలిరావడంతో కిటకిటలాడుతున్నాయి. ఇదిలాఉంటే ఈయేడు కొత్త కొత్త డిజైన్ల రాఖీలు అందుబాటులో తీసుకువచ్చారు పలువురు వ్యాపారులు.

'ఫార్మసీ చట్టాలను అమలు చేయాలి'


మాట్లాడుతున్న బత్తిని సుదర్శన్ గౌడ్

సుల్తాన్‌బజార్: ఫార్మసీ చట్టాలను అమలు చేసి మందులు ఉన్న ప్రతీ చోట ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలని గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా సమావేశం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై ఫార్మసిస్టులు 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ అనే పదాన్ని చేర్చిన సీఎంకు, వైద్యారోగ్య శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ డీహెచ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి టీచింగ్ ఆసుపత్రుల్లో ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలని విన్నవించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.గోవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సురేశ్ శ్రీనివాస్, రాజశేఖర్, వినోద్‌కుమార్, అనిత, మాధవి, రజిని, అనురాధ, అశోక్‌రెడ్డి, బస్వరాజ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల్లేకుండా చూడండి


డైరెక్టర్ ఎన్.నర్సిములుతో ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని తగు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.నర్సిములును గురువారం ఆయన కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొద్దిపాటి వర్షానికే విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే తుప్పు పట్టిన స్తంభాలను తొలగించాలని విన్నవించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, సురేశ్, భాను, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు షురూ

సాక్షి ఎఫెక్ట్..

చార్మినార్: 'అధ్వాన రోడ్లతో.. అవస్థలు' అనే శీర్షికతో ఈనెల 2న 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. గురువారం డబుల్ బెడ్రూం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఏఈ హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. పనులు ప్రారంభమయ్యాయని సీసీ రోడ్డు వేస్తామన్నారు.



ఈవీఎం గోదాం తనిఖీ



అబిడ్స్: హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ చుడిబజార్‌లోని ప్రధాన ఈవీఎం గోదామును గురువారం తనిఖీ చేశారు. వస్తువుల భద్రతా, స్థితిగతులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతను పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు గోదాం వద్ద భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే కౌసర్


టోలిచౌకీ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలో గురువారం పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వివిధ శాఖ అధికారులతో సమీక్ష ఉంటుందని ఏమైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫారన్, అజీజ్‌ఖాన్ పఠాన్, అబీబ్ చౌస్ తదితరులు ఉన్నారు.

బీసీలు, మైనార్టీల పక్షపతి కాంగ్రెస్

గోల్కొండ: బీసీలు, మైనార్టీల పక్షపతి కాంగ్రెస్ పార్టీ అని కార్వాన్ నియోజకవర్గ అధ్యక్షురాలు మామిడి మాధవి అన్నారు. కార్వాన్‌లో గురువారం పార్టీ ఏర్పాటు చేసిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పక్కాగా ఇచ్చేది కాంగ్రెస్ పార్టీయే అని, అయితే కేంద్రం ప్రభుత్వం అడ్డుపడుతుందన్నారు. కార్యక్రమంలో షకీలాబేగం, వనజ, సంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

చాంద్రాయణగుట్ట: భద్రావతి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ పాతనగరం లాల్‌దర్వాజా రాజన్నబౌలిలో గురువారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దోరెటి ఆనంద్ గుప్తా హాజరై భద్రావతి చేనేత సహకార సంఘం చైర్‌పర్సన్ వరకాల ప్రమీలా దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పులికంటి నరేశ్, సీనియర్ జర్నలిస్ట్ యాదగిరి, బీజేపీ ఓబీసీ సెల్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నందూ యాదవ్, పులికంటి వాణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి



యాకుత్‌పురా: అర్హులందరూ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని రెయిన్‌బజార్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ సూచించారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న నూతన రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలనను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నమన్నారు. మజ్లిస్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, నాయకులు, పౌరసరఫరాల శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానం



డబీర్‌పురా: బోధిఅలీషా కిడికి ప్రాంతంలోని మైసమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు వేంకటేశ్వరస్వామి చక్రస్నానం మహా పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్, ట్రస్ట్ అధ్యక్షుడు పి.సత్యం చారి, కోశాధికారి సామల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.రమేశ్‌కుమార్, సహాయ కార్యదర్శి దాస శ్రీనివాస్, శ్రీనివాస్ మేస్త్రీ, జ్ఞానేశ్వర్ షిండే, పూజోలు అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పల్లకీ సేవలో భక్తులు

స్వచ్ఛ ఆటోకు మాత్రమే చెత్త అందించాలి


ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న యూసీడీ విభాగం అధికారులు

బంజారాహిల్స్: చెత్తను బయట పడేయవద్దని, తమ ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోకు మాత్రమే అందించాలని కోరుతూ జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 యూసీడీ విభాగం అధికారులు, పారిశుధ్య కార్మికులు గురువారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని కమాన్ ఎన్‌బీటీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. సర్కిల్-18 డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో యూసీడీ డీపీఓ ఆశావిరోనిక, కమ్యూనిటీ ఆర్గనైజర్ భావ్‌సింగ్, ఎస్ఎఫ్ఏ శ్రీకాంత్, ఆర్పీలు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలను కలుసుకుని చెత్తను బయట పడేయడం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇంటి వద్దకు వచ్చే ఆటోకు అందించాలన్నారు. రోడ్లపై చెత్త పడేస్తే జరిమానాలు విధిస్తామన్నారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్‌ను ఆయా నివాసాలకు అటాచ్ చేశారు.